# జైహింద్
## -పుట్టగంటి గోపీకృష్ణ



### పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
### కౌముది నిర్వహించిన నవలల పోటీ (2023)లో
### బహుమతి పొందిన ఉత్తమ నవల
### (గత సంచిక తరువాయి)

**“డోంట్ వర్రీ!** ఎవరికీ కనపడం...” ధైర్యం చెప్తూ తను ముందు దాని కింద పడుకుంది. ఆమె పక్కన ఫ్లోరెన్స్ కూడా పడుకుంది.

వాళ్లిద్దరు ఒకరితో ఒకరు మాట్లాడుకోవటం కూడా మాని వేశారు. సమయం వేగంగా గడిచిపోతోంది. వెలుతురు క్రమంగా తగ్గి పోతోంది. దూరం నుండి వెళ్ళిపోతున్న మనుషుల కాళ్లు కనిపిస్తున్నాయి.

రాత్రి పొద్దు పోయేవరకు ఇద్దరు అలానే ట్రక్కు కింద దాక్కుని ఉన్నారు.

తరువాత బయటకు వచ్చారు.

రాత్రి పూట విమానాలు దిగే అవకాశం అక్కడ లేదు. అందుకే ఎయిర్‌ఫీల్డ్ మొత్తం నిర్మానుష్యంగా ఉంది. లైటులు వెలుగుతున్నా చీకటిని పారదోల లేక పోతున్నాయి.

డోల్మా తన వేలిని వాచ్ టవర్ల వైపు చూపించింది.

రన్‌వే చివర రెండు వైపులా రెండు వాచ్ టవర్లు ఉన్నాయి. అయితే వాటిలో ఉన్న వారి దృష్టి అంతా బయట నుండి అపాయం రాకుండా చూడటం తప్ప లోపల వైపు చూడటం కాదు. కాబట్టి ఎవరూ ఇటు చూడటం లేదు.

వెలుతురు లేని చోట నడుస్తూ టైగర్‌మోత్ ఉన్న ప్రదేశానికి వచ్చారు వారు.

“టైమెంతయింది?” అడిగింది డోల్మా.

ఫ్లోరెన్స్ దగ్గర చేతి గడియారం ఉంది. దానిలో చూసి, “పది అవుతుంది.” అని చెప్పింది.

డోల్మా, ఫ్లోరెన్స్ బయట ప్లాన్ చేసుకు వచ్చినపుడు ఈ విషయం కూడా వారి చర్చలో వచ్చింది. అసలే వారికి విమానం నడపటం రాదు. అలాంటిది విమానాన్ని రాత్రి పూట తీసుకు వెళ్లాలని ప్రయత్నించటం అయ్యే పని కాదు. అందుకే తెల్లవారుజామున వెలుతురు వచ్చే ముందు ఆ ప్రయత్నం చేయదలచుకున్నారు.

"తెల్లవారటానికి ఇంకా ఆరుగంటల సమయం ఉంది…" అంది డోల్మా. కోహిమా దేశానికి తూర్పున ఉండటంతో తెల్లవారుజామున నాలుగున్నరకే తెల్లవారుతుంది.

తెల్లవారుజామున మూడు వరకు వంతులవారీగా ఇద్దరు అక్కడే నిద్ర పోయారు. ఇంకొక గంటలో తెల్లవారుతుందనగా తమ పని మొదలు పెట్టారు. విమానానికి ఉన్న రెండు ట్యాంకుల్లో ఇంధనం పూర్తిగా నిండి ఉన్నట్లు ఇండికేటర్లు చూపిస్తున్నాయి.

టైగర్‌మోత్ ని వెనుక నుండి డోల్మా తోస్తుంటే ముందు నుండి ఫ్లోరెన్స్ లాగుతూ రన్‌వే వైపు తీసుకు వెళ్లారు. వాళ్లు అనుకున్న దానికంటే అది చాలా తేలిగ్గా కదులుతోంది. వాళ్ళకు తెలియని విషయం ఏంటంటే టైగర్‌మోత్ బరువు ఒక కారు బరువు కంటే చాలా తక్కువ. అందుకే అది అంత తేలిగ్గా కదులుతోంది. వాచ్ టవర్లకు దూరంగా విమానాన్ని తీసుకువెళ్ళి దానిని రన్‌వే మీద నిలిపారు.

టైగర్‌మోత్‌కి ఓపెన్ కాక్‌పిట్ ఉంటుంది. కాబట్టి వేగంగా వీచే గాలి ఇబ్బంది పెట్టకుండా పైలెట్లు హెల్మెట్లు పెట్టుకుంటారు. వీళ్ళ దగ్గర పెట్టుకోవటానికి హెల్మెట్లు లేవు కాబట్టి చెవుల మీదగా మఫ్లర్లు చుట్టుకున్నారు.

కాక్‌పిట్‌లో నేను ముందు కూర్చుంటానంటే, నేను కూర్చుంటానని కాసేపు వాదించుకున్నారు. తరువాత టాస్ వేసి అక్కడ ఫ్లోరెన్స్ కూర్చోవాలని ఫైనలైజ్ చేసుకున్నారు.

"నువ్వెళ్ళి ప్రొపెల్లర్ స్టార్ట్ చెయ్యి…" అంది ఫ్లోరెన్స్ డోల్మాతో.

డోల్మా ప్రొపెల్లర్ దగ్గరకు నడిచింది. ఇంతలో ఆమెకు ఏదో అనుమానం వచ్చింది. "ఫ్లోరెన్స్! మనం చేస్తున్న పని ఇప్పుడు కాకపోతే కాసేపటి తరువాత మిలటరీ వాళ్లకు తెలుస్తుంది. అప్పుడు మన పరిస్థితి ఏమిటి?"

"ఏముంది? ఏదో చిన్న పిల్లలు తెలియక చేసారు అని వదిలి పెడతారు. అంతకంటే మనల్ని ఏం చేసుకుంటారు?"

"అంతేనంటావా?"

"అంతే! అంత ఎక్కువ ఆలోచించకు. లెటజ్ డూ ఇట్…"

డోల్మా ప్రెపెల్లర్ ఆన్ చేసే ముందు ఒకసారి అల్బర్ట్ చెప్పిన జాగ్రత్తలు గుర్తుకు తెచ్చుకుంది. సైడు డోర్ ఓపెన్ చేసి లీవర్ అడ్జస్ట్ చేసింది. తరువాత ప్రొపెల్లర్ బలంగా తిప్పి వేగంగా వెనక్కి జరిగింది.

పెద్దగా శబ్దం చేస్తూ ఇంజిన్ స్టార్ట్ అయింది.

నిశ్శబ్దంగా ఉన్న వాతావరణంలో ఆ శబ్దం మరింత పెద్దగా వినిపించింది. వాచ్ టవర్లలో ఉన్న వారు వెనక్కి తిరిగి చూశారు. ఈ సమయంలో రన్‌వే మీద విమానం ఉండటం వారికి అనుమానం కలిగించింది. కానీ, ఏమి చేద్దామో నిర్ణయించుకునే లోపే ఆ విమానం కదలటం మొదలయింది.

అక్కడ ఇంజిన్ స్టార్ట్ చేసిన డోల్మా తను కూడా పరుగెత్తుతూ వెనక్కి వెళ్ళి వెనుక కాక్‌పిట్‌లో కూర్చుంది. ఇద్దరు సీటు బెల్టులు బిగించుకున్నారు.

విమానం వేగం పెరిగింది. కొద్దిగా జాయ్‌స్టిక్ వెనక్కి లాగింది ఫ్లోరెన్స్. విమానం చక్రాలు భూమి మీద నుండి కొద్దిగా పైకి లేచాయి. భయం అంటే ఏమిటో ఎరగని ఫ్లోరెన్స్‌కి కూడా భయం వేసింది. జాయ్‌స్టిక్‌ని ముందుకు వంచింది ఫ్లోరెన్స్. 'ధడ్...' అంటూ తిరిగి చక్రాలు నేలకు గుద్దుకున్నాయి.

"రన్‌వే చివరికి వస్తున్నాం..." హెచ్చరించింది డోల్మా. "ఇప్పుడు ఎగరక పోతే ఇక ఎగరటం కుదరదు. వాచ్ టవర్ మీద ఉన్న వాళ్ళు మనల్ని చూసేశారు..."

అయినా ఫ్లోరెన్స్ సందిగ్ధం నుండి తేరుకోలేక పోయింది.

డోల్మా కూర్చున్న వెనుక కాక్‌పిట్‌లో కూడా అన్ని కంట్రోల్సూ ఉన్నాయి. జాయ్‌స్టిక్ పట్టుకుని బలంగా వెనక్కి లాగింది డోల్మా. విమానం ఒక్కసారిగా గాల్లోకి లేచింది.

"ఓ...' అంటూ అరిచారు ఇద్దరూ. విమానం గాల్లో ఎత్తుకు ఎగురుతున్న కొద్దీ వారి అరుపు మరింత పెద్దదయింది.

వాచ్ టవర్ మీద ఉన్న సైనికులు నోర్లు తెరచుకుని చూస్తూ ఉండగా ఇద్దరు మఫ్లర్లు కట్టుకున్న యువతులు విమానంలో ఎగిరి పోయారు.

***

ఎదురుగా మబ్బులు కనిపిస్తున్నాయి.

"అమ్మో మబ్బులు. గుద్దుకుంటే విమానం కూలిపోతుందేమో..." అంటూ అరిచింది డోల్మా.

జాయ్‌స్టిక్ ఎడమ వైపు లాగింది ఫ్లోరెన్స్. విమానం ఆ దిక్కుకు తిరిగింది. పైకి ఎగురుతున్న విమానం పక్కకు తిరగటానికి కూడా ప్రయత్నించటంతో ఒక పక్కకు ఒరిగి పోయింది. మళ్లీ ఇద్దరూ పెద్దగా అరిచారు. ఇంతా చేసి అటు కూడా మబ్బులు ఉన్నాయి.

"ఆల్టిట్యూడ్ పెరిగి పోతోంది. విమానాన్ని లెవల్ చేయాలనుకుంటా..." ఎదురుగా ఉన్న ఆల్టిట్యూడ్ రీడింగ్ చూస్తూ అంది డోల్మా. ఆల్టిట్యూడ్ రీడింగ్ చూపించే డయల్ మధ్యలో విమానం బొమ్మ ఉంది. దానిని లెవల్ చేయగలిగితే విమానం కూడా లెవల్ అవుతుందని ఇద్దరు ఒకేసారి తెలుసుకున్నారు. జాయ్‌స్టిక్‌ని స్వల్పంగా కదిలిస్తూ ఎట్టకేలకు విమానాన్ని లెవల్ చేయగలిగారు వారు. ఈ హడావుడిలో ఎదురుగ్గా దగ్గరగా వచ్చిన మబ్బుల్ని వారు గమనించుకోలేదు.

విమానం మబ్బుల్లోకి దూసుకు పోయింది. ఇక తాము పడిపోతామనుకుని కెవ్వు మని కేకలు పెట్టారు. అయితే వారిని ఆశ్చర్యానికి గురిచేస్తూ విమానానికి ఏమీ కాలేదు. మబ్బుల్లో నుండి దూసుకు పోయి బయటకు వచ్చింది విమానం.

"మబ్బు అంటే పొగా? నేను వేరేగా ఊహించుకున్నాను..." ఆశ్చర్యపోతూ అంది ఫ్లోరెన్స్.

ఇప్పుడు మబ్బులు వారి మొహాలకు కూడా చల్లగా తగులుతున్నాయి.

"మైగాడ్... దిసీజ్ రియల్ ఎగ్జయిట్‌మెంట్..." డోల్మా పెద్దగా అంది.

కింద భూమి మీద విస్తారంగా వ్యాపించిన అడవులు వేగంగా కదిలి పోతున్నాయి.

వారికి ఆనందంతో సమయం తెలియటం లేదు. గంటలు క్షణాల్లా గడిచిపోతున్నాయి.

టైగర్‌మోత్ 150 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది. ఒకసారి నింపుకున్న ఇంధనంతో దాదాపు 500 కిలోమీటర్ల దూరం ప్రయాణించగలదు.

వారి ప్రయాణం మొదలు పెట్టి మూడు గంటలు అవవస్తోంది. అప్పుడు హఠాత్తుగా ఫ్లోరెన్స్ దృష్టి ఇంధన ఇండికేటర్ మీదకు పోయింది. అది ఖాళీ అవబోతున్న ఇంధనాన్ని సూచించటంతో ఉలిక్కి పడింది ఆమె.

"డోల్మా! ఫ్యూయల్ ఇండికేటర్ చూడు..." అంటూ కేక పెట్టింది ఫ్లోరెన్స్.

"ఇంతలోనే మొత్తం ట్యాంకు ఖాళీ అయిందా?" ఆందోళన, భయం నిండిన గొంతుతో అంది డోల్మా. "ఇండికేటర్ తప్పు చూపిస్తుందేమో?" అని అనుమానం కూడా వెలిబుచ్చింది.

"మనం వెనక్కి వెళ్లాలి."

"అసలు ఇప్పుడు ఎక్కడ ఉన్నామో తెలిస్తే కదా, వెనక్కి ఎటు వెళ్లాలో తెలిసేది."

"నిజమే! అసలు మనం ఎక్కడ ఉన్నట్లు?"

"ముందు విమానాన్ని కిందకు తీసుకు వెళ్దాం... ఇంధనం పూర్తిగా అయిపోయే లోపు కిందకు దింపక పోతే ఇది మనల్ని సరాసరి పైకి తీసుకు పోతుంది."

ఈ మూడు గంటల్లో వచ్చిన అనుభవంతో ఈసారి సులువుగానే విమానాన్ని కిందకు తీసుకు వెళ్లారు.

"కింద చూడు. ఇక్కడి జాగ్రఫీ నీకు కొట్టిన పిండి కదా. మనం ఎక్కడ ఉన్నామో ఏమన్నా అర్థమవుతుందా?" అంటూ అడిగింది ఫ్లోరెన్స్.

"అసలు ఈ ప్రాంతం తెలిసిన ప్రాంతంలా లేదు." మరింత గాభరాగా అంది డోల్మా.

కింద అన్నీ చెట్లు కనిపిస్తున్నాయి. విమానం దిగటానికి అనువయిన స్థలం ఏదీ కనపడటం లేదు.

"ఫ్లోరెన్స్! మనకు మూడింది..." గాభరాగా అంది డోల్మా.

విమానాన్ని కంట్రోల్ చేస్తూనే వారిద్దరు ల్యాండ్ చేయటానికి అనువయిన చోటు కోసం నలువేపులా చూస్తున్నారు.

ఇంతలో దూరంగా అడవి అంతమయి పచ్చటి మైదానం కనిపించింది.

అయితే ఆ మైదానంలో మధ్యమధ్యలో అనేక చోట్ల కొండ శిలలు ఉన్నాయి. ఆ మైదానంలో విమానం దింపవచ్చు కానీ, ఏ శిలకు గుద్దుకున్నా, విమానం బద్దలవటం ఖాయం. అంత వేగంతో గుద్దుకున్న విమానం లోని మనుషుల పరిస్థితి ఏమిటన్నది ఎవరయినా ఊహించవచ్చు.

“ఏం చేద్దాం?” అంది ఫ్లోరెన్స్.

డోల్మా సమాధానం చెప్పే లోపు ఆఖరిసారి గుడగుడ శబ్దం చేస్తూ విమానం ఇంజిన్ తిరగటం ఆగిపోయింది.

“ఇక ఆలోచించేది ఏమీ లేదు…” అంటూ ఫ్లోరెన్స్ విమానాన్ని మరింత కిందకు దించింది.

వీస్తున్న గాలులకు విమానం ఊగుతోంది. కిందకు వచ్చే కొద్దీ విమానాన్ని కంట్రోల్ చేయటం కష్టమవుతోంది. అయినా తమ కొద్ది అనుభవాన్నే పెట్టుబడిగా పెట్టిన ఆ ఇద్దరు విమానాన్ని భుమికి మరింత చేరువగా తెచ్చారు.

ధడ్ అని శబ్దం చేస్తూ విమానం నేలకు తాకింది. ఎదురుగా ఒక పెద్ద శిల అతి వేగంగా విమానానికి దగ్గరవుతోంది. ఆ శిల అడ్డు తప్పించటానికి జాయ్‌స్టిక్‌ని ఎడమ వైపు తిప్పింది ఫ్లోరెన్స్.

అల్బర్‌ట్ చెప్పని విషయం, వీరికి తెలియని విషయం ఏంటంటే… టైగర్‌మోత్ రెక్కలు భూమికి దగ్గరగా ఉంటాయి. విమానం నేల మీద ఉన్నపుడు విమానాన్ని మలుపులు తిప్పటానికి జాయ్‌స్టిక్ వాడకూడదు, రడ్డర్ వాడాలి. జాయ్‌స్టిక్ ఎడమ వైపు తిప్పితే ఎడమ వైపు రెక్క కిందకు దిగుతుంది. ఇప్పుడు కూడా అదే జరిగింది. రెక్క పక్కకు వంగి నేలకు తగిలింది. అంతే! రెక్క విరిగి పోయింది. విమానం గిర్రున తిరిగి మరో శిల వైపు పరుగెత్తింది. ఫ్లోరెన్స్ గాభరాగా జాయ్‌స్టిక్‌ని మరో వైపు తిప్పింది. ఈసారి మరో రెక్క విరిగింది. అంతేకాదు… ఈసారి విమానం శిలకు కొట్టుకోకుండా ఆగలేదు. కాకపోతే అప్పటికే విమానం వేగం తగ్గిపోవటం వలన వీరికి ఏమీ కాలేదు.

ఇద్దరు సీటు బెల్టులు విప్పుకుని విమానం నుండి కిందకు దూకారు.

ప్రాణాలతో బయట పడతామని ఇద్దరు అనుకోక పోవటం వలని వారికి జరిగింది నమ్మశక్యంగా లేదు.

ఇంతలో ఏదో అలజడి వినిపించి వెనక్కి తిరిగి చూసిన వారికి, పరుగెత్తుకుంటూ వస్తూ చుట్టుముడుతున్న జపాను మిలటరీ వాళ్లు కనిపించారు.

ముందుకు వచ్చిన జపాను సైనికుడు తన భాషలో ఏదో అడిగాడు.

అతని భాష వీరిద్దరికీ అర్థం కాలేదు.

కాసేపు అతను ఏదేదో అరచిన తరువాత ఇది మార్గం కాదనుకుని వెనక్కి తిరిగి తన వారికి ఏదో చెప్పాడు.

అతను తమ దగ్గరకు వచ్చే లోపే, “డోల్మా! ఎట్టి పరిస్థితుల్లో మా నాన్న ఎయిర్‌ఫోర్సులో చేస్తాడని చెప్పకు…” అని చెప్పింది ఫ్లోరెన్స్.

జపాను వాళ్లకు, బ్రిటిషు వాళ్లకు జరుగుతున్న యుద్ధం గురించి వారిద్దరికి తెలుసు. ఎదురుగా వస్తున్నది జపాను వాళ్లలా ఉండబట్టి అసలు నిజం చెప్తే జరిగే ప్రమాదం ఏమిటో డొల్మాకు కూడా అర్థమయింది.

కాసేపటి తరువాత అక్కడకు కొంత మంది భారతీయ సైనికులు వచ్చారు.

వారు మరొకసారి, "ఎవరు మీరు?" అని అడిగారు.

"మేము కోహిమా నుండి వస్తున్నాము..." అని చెప్పిన డోల్మా ధైర్యం చేసి, "మేము ఎక్కడ ఉన్నాము?" అని అడిగింది.

"మీరు బర్మా సరిహద్దుల్లో ఉన్నారు. ఇది జపాను – ఆజాదు హింద్ ఫౌజుల ఉమ్మడి దళం. భారతదేశం లోకి ప్రవేశించటమే లక్ష్యంగా ఇక్కడ ఉన్నాం..." అని చెప్పిన వారు, "మీకు ఈ విమానం ఎక్కడిది?" అని అడిగారు.

"ఇది రాయల్ ఎయిర్‌ఫోర్స్ విమానం. ఎయిర్‌ఫీల్డు నుండి దొంగలించాం..." చెప్పింది డోల్మా.

"ఎక్కడకు వెళ్లాలని మీ ఆలోచన?"

"తెలియదు. బ్రిటిషు వాళ్లకు వ్యతిరేకంగా పోరాడాలంటే అక్కడ నుండి బయటపడాలని ఇలా చేశాము." అని కల్పించి చెప్పింది డోల్మా. ఎదురుగా ఉన్న వాళ్ళు బ్రిటిషు వాళ్లకు శత్రువులు కాబట్టి, తను కూడా అలా చెప్తే తమకు ఎలాంటి ప్రమాదమూ ఉండదని భావించింది.

ప్రశ్నలు అడుగుతున్న వ్యక్తి దృష్టి ఫ్లోరెన్స్ మీద పడింది. "ఈ అమ్మాయి బ్రిటిషు అమ్మాయిలా ఉందే... ఈ అమ్మాయి నీతో ఎందుకు ఉంది?" అన్నాడు గద్దిస్తున్నట్లు.

"ఆ అమ్మాయి లోపలకు తీసుకు వెళ్తేనే ఎయిర్‌ఫీల్డులోకి వెళ్లగలిగాను. బ్రిటిషు అమ్మాయి అయినా, మనకే సహకరిస్తుంది..."

"ఇప్పుడు ఏం చేయదలచుకున్నారు?"

కోహిమా వెళ్తే ఇంత ఖరీదయిన విమానాన్ని తుక్కుతుక్కు చేసినందుకు తమ ఇద్దరినీ జైలులో పెడతారని డోల్మాకు తెలుసు. ఫ్లోరెన్స్‌కి జైలు శిక్షతో సరిపెట్టినా తనకు గ్యారంటీగా మరణశిక్ష పడుతుందని కూడా ఆమెకు తెలుసు. అందుకే, "మీతోనే ఉంటాం. మీ యుద్ధంలో పాలు పంచుకుంటాం..." అని చెప్పింది.

ఇంతలో మరింత పెద్ద అధికారి వచ్చాడు. జరుగుతున్నది వారికి వివరించారు. శిథిలమయిన విమానాన్ని, దాన్ని నడిపిన యువతులను క్యూరియస్‌గా చూశాడతను.

"ఏ ట్రైనింగూ లేకుండా కోహిమా నుండి దీన్ని నడుపుకు వచ్చారా?"

అవునన్నట్లు తలలు ఊపారు ఆడపిల్లలు అమాయకంగా.

"అంతేకాదు సార్... మనతో కలిసి యుద్ధం చేస్తారంట."

ఆ అధికారి "మీ కోరిక గొప్పది. కానీ మీరు పోరాడవలసింది మాతో కలిసి కాదు. ఝాన్సీ రాణి రెజిమెంట్ ఉంది. దానిలో అందరు ఆడవాళ్లే ఉంటారు. దానికి కెప్టెన్ లక్ష్మి నాయకత్వం వహిస్తోంది. ఆమె మీకు సరయిన శిక్షణ అందిస్తుంది. మిమ్మల్ని తగిన విధంగా ఉపయోగించుకుంటుంది. అక్కడకు పంపుతాను, వెళ్తారా?" అన్నాడు.

"వెళ్తాము సార్…" అన్నారు వారు.

ఆ అధికారి అవతలకు వెళ్లగానే డోల్మా, ఫ్లోరెన్స్ ఒకరిని చూసి ఒకరు నవ్వుకున్నారు. "ముందు ఇక్కడ నుండి తప్పించుకుంటే, తరువాత ఆ శిబిరం నుండి తప్పించుకోవటం ఎంతసేపు?" అనుకుని కన్ను కొట్టుకున్నారు.

ప్రస్తుతం…

"పంచ్ పటాకా… అనే వాళ్లు మా అయిదుగురిని. మేము కలిసి గడిపిన సమయం కొన్ని నెలలే. కానీ… చూస్తున్నావుగా ఆ జ్ఞాపకాలు జీవితాంతం ఎలా గుర్తు ఉన్నాయో?" అంది కాంచనమాల.

ప్రస్తుతం వారిద్దరు బర్మాలోని యాంగాన్‌లో ఉన్నారు. అక్కడి నేషనల్ మ్యూజియమ్ చూసి బయటకు వస్తున్నారు.

అక్కడ నుండి చాలా దగ్గరలోనే ఉంది వారు బస చేసిన హోటల్.

"హోటల్‌కి వెళ్లే ముందు ఇంకెక్కడికయినా వెళ్దామా మేడమ్?"

"నేను ఇంతకు ముందు ఇక్కడ ఉన్నపుడు బహదూర్ షా జఫర్ సమాధి చూడాలనుకున్నాను. అప్పుడు కుదరలేదు. కనీసం ఇప్పుడయినా చూద్దాం..." అంది ఆమె.

ఇద్దరూ బహదూర్ షా జఫర్ దర్గా చేరుకున్నారు. కొంత సమయం అక్కడ గడిపిన తరువాత హోటల్‌కి బయలుదేరారు.

"ఆ రోజుల్లో ఈ నగరంలో సగం మందికి పైగా భారతీయులే ఉండేవారు… బహదూర్ షా జఫర్ మొఘలుల ఆఖరి చక్రవర్తి. బ్రిటిషు ప్రభుత్వం ఆయన్ని ఇక్కడే బంధించారు. ఆయన ఇక్కడి బందిఖానాలోనే ప్రాణాలు విడిచారు…" చెప్పింది కాంచనమాల.

"ఇంత దూరంలో ఎందుకు బంధించవలసి వచ్చింది మేడమ్?"

"సిపాయిల తిరుగుబాటు సమయంలో బ్రిటిషు వారిని ఎదిరించిన భారతీయ సైనికులు ఢిల్లీలోని బహదూర్ షా జఫర్‌ను భారతదేశానికి చక్రవర్తిగా ప్రకటించాలనుకున్నారు. వారు ఆ ప్రయత్నాలలో విఫలమయినా, దానినే సాకుగా చూపి ఆయన్ని రంగూన్ దేశాంతరం పంపారు. ఇక్కడ 14 సంవత్సరాలు బందీగా గడిపిన ఆయన 1872 లో ఇక్కడే మరణించాడు…"

మయాంక్ నోట్‌బుక్‌లో పాయింట్లు రాసుకోవటం ఆపి తలెత్తి చూశాడు.

"మేడం! డోల్మా, ఫ్లోరెన్స్ ఇక్కడికి చేరుకునేటప్పటికి... మీరు, మీ రెజిమెంట్ రంగూన్ చేరుకున్నారా?"

"అవును. మొత్తం రెజిమెంట్ కాదు. అందులో సెలెక్ట్ చేసిన కొందరిని ముందుగా రంగూన్ పంపారు. అందులో నేనూ, మధుబాల, చేవా కూడా ఉన్నాం. తరువాత మాతో కొత్తగా వచ్చిన డోల్మా, ఫ్లోరెన్స్ కూడా కలిశారు."

"మీరు కూడా యుద్ధం చేసేవాళ్లా?"

"అంతకంటే ఎక్కువే చేసేవాళ్లం. మా కెప్టెన్ లక్ష్మి గురించి నీకు చెప్పలేదు కదూ. ఆవిడే ఝాన్సీ లక్ష్మీ రెజిమెంట్ కమాండర్. ఆజాద్ హింద్ ప్రభుత్వంలో స్త్రీ సంక్షేమ శాఖ మంత్రి కూడా. ఆవిడ మద్రాస్ మెడికల్ కాలేజి నుండి ఎమ్.బి.బి.ఎస్. డిగ్రీ తీసుకుంది. తరువాత గైనకాలజీలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది. ట్రిప్లికేన్‌లోని కస్తూర్‌బా గాంధీ హాస్పిటల్‌లో పనిచేసేది. ఆమె వివాహం పైలెట్‌గా పనిచేసే పి.కె.ఎన్. రావ్‌తో జరిగింది. తన ఇరవై ఆరవ ఏట వివాహం విఫలం కావటంతో విడాకులు తీసుకుంది. జీవితంలో విఫలం చెందాననుకున్న ఆమె తన శేష జీవితాన్ని దేశం కోసం అర్పించదలచి సింగపూర్ చేరుకుంది. అక్కడ ఆజాద్ హింద్ ఫౌజ్‌లో చేరింది. నాలాంటి వేలాది మంది ఆడవారు ఆజాద్ హింద్ ఫౌజులో చేరటానికి ప్రేరణ కలిగించింది. స్వాతంత్రం వచ్చాక డాక్టరుగా, సామాజిక వేత్తగా బాధ్యతలు నెరవేరుస్తూ 97 సంవత్సరాల వయసులో 2012లో చనిపోయింది. భారత ప్రభుత్వం ఆమెకు 1998లో పద్మవిభూషణ బిరుదు ఇచ్చి సన్మానించింది..."

"మీ పాంచ్‌పటాకా గురించి వింటుంటే ఎవరూ మీ లీడర్ లక్ష్మికి తీసిపోరని అనిపిస్తోంది. మీ స్నేహితుల గురించి ఇంకా చెప్పండి మేడం..."

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

COMMENTS